క్లుప్తంగా

గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన



విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్సై జయశ్రీ

సాక్షి, భీమవరం: విద్యార్థినులు పరిచయం లేని వ్యక్తులతో మాట్లాడడం అంతగా మంచిది కాదని ప్రతి విద్యార్థిని గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అవగాహన కలిగి ఉండాలని భీమవరం దిశ పోలీసుస్టేషన్ ఎస్సై జయశ్రీ అన్నారు. శుక్రవారం తాడేరు రోడ్‌లోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్కూల్ విద్యార్థులు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఏదైనా ఆపద వస్తే దిశా కాల్ సెంటర్ నెంబర్ 112 ఉపయోగించుకోవాలని సూచించారు. ఫోన్ వచ్చిన కేవలం ఐదు నిమిషాల్లోనే బాధితులకు పోలీసు సహాయం అందిస్తారన్నారు.

నేడు మంత్రి కారుమూరి పర్యటన ఇలా

అత్తిలి: మండలంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను శనివారం రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ప్రారంభించనున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ చెప్పారు. మధ్యాహ్నం 3గంటలకు అత్తిలి మండలం కె సముద్రపుగట్టు గ్రామంలో జగనన్న ఇళ్ల పట్టాలను మంత్రి పంపిణీ చేస్తారని, అనంతరం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. సాయంత్రం 4 గంటలకు బల్లిపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ భవనాలు, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్‌సెంటర్ భవనాలను మంత్రి ప్రారంభిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

15న ప్రజారక్షణ భేరి



ఉండిలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా నాయకుడు గోపాలన్

ఉండి: విజయవాడలో ఈ నెల 15న నిర్వహించే ప్రజారక్షణ రణభేరీ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరావాలని సీపీఎం జిల్లా నాయకుడు జేఎన్వీ గోపాలన్ అన్నారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న ప్రచారజాతకు ఉండిలో సీపీఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అనంతరం గోపాలన్ మాట్లాడుతూ ప్రజాసమస్యలపై ప్రభుత్వాలతో పోరాడే ఈ కార్యక్రమానికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జవ్వాది శ్రీనివాసరావు, చైతన్య ప్రసాద్, షేక్ వలీ, మాదాసి గోపీ తదితరులు పాల్గొన్నారు.

దువ్వలో కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభం

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో బైర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళలకు ఉచిత కుట్టుశిక్షణా కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ అడ్డా బాబు ప్రారంభించారు. దువ్వ గ్రామంలోని బైర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే గ్రామ వికాస కేంద్రంలో ఈ కుట్టు శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేసి గ్రామంలో మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణతో పాటు ఇతర వృత్తుల్లో శిక్షణ ఇస్తున్నట్లు బైర్రాజు ఫౌండేషన్ కన్వీనర్ శ్రీనివాసరాజు తెలిపారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దండు వెంకట కృష్ణంరాజు, జే వీ రామరాజు, ఐ రంగరాజు, సీహెచ్ సుబ్బరాజు, మహిళలు పాల్గొన్నారు.

కార్గో సేవలు సద్వినియోగం చేసుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ):ఏపీఎస్ ఆర్టీసీ, కార్గో డెలవరీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణమూర్తి తెలిపారు. డిపో నుంచి పోలీస్ ఐలాండ్ వరకు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ పది కిలో మీటర్ల పరిధిలో 50 కేజీల బరువు వరకు బుకింగ్ చేసిన డెలివరీ పార్శిల్, కొరియర్లను ఇంటి వద్దకు తక్కువ చార్జీలతో సకాలంలో సురక్షితంగా ఇంటి వద్దకు చేర్చుతున్నట్లు చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

బస్సు యాత్ర విజయవంతం చేయాలి

పాలకొల్లు అర్బన్: పాలకొల్లులో ఈ నెల 8న నిర్వహించే సామాజిక సాధికారిక బస్సు యాత్రను విజయవంతం చేయాలని పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు కోరారు. పట్టణంలోని 12వ సచివాలయ పరిధిలోని 27వ వార్డులో శుక్రవారం పార్టీ నాయకులు, మహిళలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వార్డు ఇన్‌చార్జ్ ఉప్పె పండుబాబు, పార్టీ నాయకులు బంగారు రాజు, ఎన్‌వీఎన మాధు సుధాకరరావు, కలిగితి వరప్రసాద్, ఎన్‌వీఎస్ ప్రసాద్, సీఆర్‌పీ కె.శంకుతల తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమం

డీసీసీబీ చైర్మన్ పీవీఎల్



జువ్వలపాలెంలో ప్రజలకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్, రామరాజు

కాళ్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని ప్రజలంతా సీఎం జగన్ ను ఆశీర్వదించాలని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు, టీటీడీ బోర్డు మాజీ మెంబర్ గోకరాజు రామరాజు కోరారు. మండలంలోని జువ్వలపాలెం సచివాలయ పరిధిలో మూడో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీఎల్, రామరాజు గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంట్లో వివిధ పథకాల ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి ఏ రాష్ట్రంలో చేయని విధంగా సంక్షేమ పథకాల అందిస్తున్నారని అన్నారు. కరోనా సమయంలో ప్రాణాలు తెగించి విశిష్ట సేవలు అందించిన వలంటీర్ వ్యవస్థ ప్రతిపక్ష నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే సంక్షేమ పథకాలన్నీ రద్దు చేస్తారని ప్రజలు గమనించాలని కోరారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు వారికి అందుతున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని మౌలిక వసతులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రుద్రరాజు రామకృష్ణ రాజు, వైఎస్సార్ సీపీ యూత్ మండల అధ్యక్షుడు కటారి లక్ష్మీపతి రాజు, ముదిండి సురేష్ రాజు, సర్పంచ్ మీసాల రమణ, ఎంపీపీ పెనుమత్స విశ్వనాథరాజు, ఆకివీడు, ఉండి ఏఎంసీ చైర్మన్‌లు షేక్ హుస్సేన్, బి.వెంకటేశ్వర్లు ఎంపీటీసీ సభ్యుడు మీసాల శ్రీనివాస్, మండల కో ఆప్షన్ సభ్యులు గుర్రం బెనాహర్ బోధనపు కన్నయ్య ఆకివీడు ఏఎంసి వైస్ చైర్మన్ గంట ఆనందరావు, దుర్గారావు, సందీప్, ఎడ్ల శ్రీనివాస్, దొడ్డి శ్యామ్ సుందరి తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఎన్నికల స్పెషల్ క్యాంపులు

ఉండి: నియోజకవర్గ వ్యాప్తంగా ఎలక్షన్ స్పెషల్ క్యాంపైన్‌డే కార్యక్రమాన్ని శనివారం, ఆదివారం నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి జి.మల్లికార్జునరావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతతి పోలింగ్ బూత్ పరిధిలో అధికారులు అందుబాటులో ఉంటున్న దృష్ట్యా కొత్త ఓటర్లు తమ ఓటు హక్కు నమోదు, అలాగే సవరణ, తొలగింపు వంటి వాటి కోసం పోలింగ్ కేంద్రాన్ని సందర్శించాలని సూచించారు. అలాగే చిరునామా మార్పు, డబుల్ ఎంట్రీ, ఓటరు తమ ఓటు జాబితాలో ఉన్నదీ లేనిదీ చూసేందుకు ఓటరు జాబితా పరిశీలన చేసుకోవచ్చునని ఆయన సూచించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బూత్ లెవెల్ అధికారులు ఆయా బూత్‌ల పరిధిలో అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు.

మహిళా బ్యాంకులుగా డ్వాక్రా గ్రూపులు



శ్రీనగర్ కాలనీలో డ్వాక్రా సంఘాల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: మహిళా బ్యాంకులుగా డ్వాక్రా సంఘాలు గ్రామాల్లో సేవలందించడం గర్వకారణమని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, మెప్మా చైర్మన్ మోరా జ్యోతి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు పళ్లెం అరుణకుమారి చెప్పారు. స్థానిక క్రాంతి, శ్రీనగర్ కాలనీ స్లమ్ సమాఖ్యల సర్వసభ్య సమావేశం ఆయా ప్రాంతాల్లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ డ్వాక్రా సంఘ సభ్యులు పొదుపు చేసిన సొమ్మును తిరిగి సభ్యులకు రుణాలుగా అందజేయడం అభినందనీయమన్నారు. బ్యాంకుల ద్వారా గతంలో ప్రతీ సభ్యురాలు రూ. 2 వేలు రుణం పొందేవారని, ప్రస్తుత ప్రభుత్వం 3 లక్షలు నుంచి రూ. 5 లక్షల వరకూ రుణం అందజేస్తుందని చెప్పారు. ఒకొక్క గ్రూపు రూ. 50 లక్షల వరకూ రుణాలు పొంది, ఆ సొమ్మును ఇతరుల అవసరాలకు, చిరు వ్యాపారాలకు వినియోగిస్తుండటం ఆనందదాయకమన్నారు. మహిళలు పొదుపును మరింతగా పెంచుకుని రుణసదుపాయాన్ని పెంచుకోవాలన్నారు. ప్రభుత్వం సున్నా వడ్డీ సౌకర్యం కల్పించిందన్నారు. అనంతరం ఆడిట్ వివరాల్ని తెలియజేస్తూ క్రాంతి స్లమ్ సమాఖ్యకు డ్వాక్రా రుణమాఫీ(ఆసరా) ద్వారా రూ.1,43,65,587లు, సున్నా వడ్డీ రూ. 21,47,312లు వచ్చిందని, శ్రీనగర్ కాలనీ సమాఖ్యకు ఆసరా రూ. 1,60,39,194లు, సున్నా వడ్డీ 22,53,419లు వచ్చిందని చెప్పారు. మహిళలు ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దొడ్డి జగదీష్, వార్డు ఇన్‌చార్జి జోగి నాగరాజు, జేసీఎస్ కన్వీనర్ శిరపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'గడపగడపకు'తో ప్రజలకు మేలు



చినకాపవరం గ్రామంలో ప్రధాన రహదారికి చేర్చి నిర్మించిన డ్రెయిన్

ఆకివీడు: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తమ గ్రామంలోని ప్రజలకు మేలు జరిగిందని మండలంలోని చినకాపవరం సర్పంచ్ నాతిరెడ్డి ఆదిలక్ష్మీ, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు నాతిరెడ్డి అన్నవరం చెప్పారు. గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మూడు నెలల క్రితం డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికీ తిరిగిన పీవీఎల్‌కు పలు చోట్ల సీసీ రోడ్లు, డ్రెయినేజీ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఆయా పనులకు నిధులు వెంటనే కేటాయించారు. దీంతో రామయ్య గూడెం, దండగర్ర, మహాలక్ష్మీపురం, బీసీ కాలనీ, ప్రధాన రోడ్డుకు డ్రెయినేజీ సౌకర్యం, సీసీ రోడ్ల నిర్మాణం పనుల్ని వేగంగా పూర్తి చేశామన్నారు. రూ. 20 లక్షలతో ఆయా సీసీ రోడ్లు, డ్రెయినేజీ సౌకర్యంతో గ్రామంలోని చాలా ప్రాంతాల్లోని ప్రజలకు డ్రెయినేజీ సమస్య పరిష్కారమైందని ఆదిలక్ష్మీ, అన్నవరం చెప్పారు. తక్షణం నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయడానికి సహకరించిన పీవీఎల్ నర్సింహరాజు, జెడ్పీటీసీ సభ్యుడు వెంకట్రాజు, ఎంపీపీ జయలక్ష్మీలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆకివీడులో అన్నసమారాధన



అన్నసమారాధనను ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఆకివీడు: సుభిక్షంగా ఉన్న రాష్ట్రంలో ప్రజలు సంతోషంతో పండుగలు, ఉత్సవాలు, వార్షికోత్సవాలను వైభవోపేతంగా నిర్వహించుకుంటున్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. స్థానిక దుంపగడప రైల్వే గేటు వద్ద హున్న కనక దుర్గమ్మ ఆలయం వద్ద దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా అఖండ అన్నసమారాధనను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ ప్రజలు ఆనందంగా ఉన్నప్పుడే అమ్మవార్ల జాతర్లు, వార్షికోత్సవ సంబరాలు మిన్నంటుతాయని చెప్పారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, విప్ పడాల శ్రీనివాసరెడ్డి, వైస్‌చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, ఏఎంసీ చైర్మన్ ఎస్కే రసూల్‌బీబీ, ఎంపీపీ కఠారి జయలక్ష్మీ, కౌన్సిలర్ గేదల అప్పారావు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా చెక్కు అందజేత



వర్ధనపు రాజ్‌కుమార్ కుటుంబసభ్యులకు రూ.5లక్షల చెక్‌ను అందిస్తున్న నాయకులు

భీమవరం అర్బన్: ఆపదలో ఉన్నవారికి పెద్ద కొడుకులా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉంటున్నారని సర్పంచ్ కోళ్ల బాలకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు తేలి జోషఫ్ రవికుమార్ అన్నారు. భీమవరం మండలంలోని దిరుసుమర్రు గ్రామానికి చెందిన వర్ధనపు రాజ్‌కుమార్ సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు రొయ్యల కంటైనర్ ఢీ కొనడంతో మృతి చెందాడు. డాక్టర్ వైఎస్సార్ జీవిత బీమా ద్వారా రూ. 5 లక్షలు శుక్రవారం ప్రభుత్వం నుంచి విడుదల కావడంతో ఆ చెక్‌ను సర్పంచ్ కోళ్ల బాలకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు తేలి జోషఫ్ రవికుమార్‌లు వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు, వ్యాధుల బారిన పడిన వారికి, ఆసరా కోల్పోయిన వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉండి ఆదుకుంటున్నారన్నారు. అంతేకాకుండా కుటుంబంలో ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందిస్తూ పెద్ద కొడుకులా సమస్యలు తీర్చుతున్నారన్నారు.

ఆరోగ్యంపై విద్యార్థినులు శ్రద్ధ వహించాలి

పెంటపాడు: యుక్తవయస్సు ప్రారంభంలో విద్యార్థినులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పెంటపాడు ఆరోగ్యకేంద్రం కమ్యూనిటీ హెల్త్ అధికారి పి. ఏసు జ్యోతి ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాల విద్యార్థినులకు ఆరోగ్యపరీక్షలు, రక్తశాతం పరీక్షలు, తీసుకోవాల్సిన ఆహారం తదితర విషయాలపై అవగాహన నిర్వహించారు. కళాశాల మహిళాసాధికారత విభాగ రెడ్‌రిబ్బన్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఉమన్స్ కన్వీనర్ జయంతి కుమారి తదితరులు పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అధ్యాపకులు గంధం వాణి, వి. కుసుమకుమారి, ఎన్‌సీసీ అధికారి ప్రేమ్‌సాగర్, రచయిత సుంకరగోపాల్ పాల్గొన్నారు.

కార్పొరేట్ వైద్యం జగనన్నకే సాధ్యం



పైడిపర్రులో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మందులను అందజేస్తున్న నాయకులు

తణుకు టౌన్ : పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య చెప్పారు. శుక్రవారం తణుకు పట్టణ పరిధిలోని పైడిపర్రు, వెంకట్రాయపురం ప్రాంతాల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ప్రజలకు అవసరమైన ఖరీదైన వైద్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల ముందుకు తీసుకొచ్చారని, దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష పథకం గురించి వివరించారు. ఈ శిబిరాల్లో మొత్తం 1520 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు బి.దుర్గా మహేశ్వరరావు తెలిపారు. వీరిలో 21 మందిని రిఫరల్ ఆస్పత్రులకు రిఫర్ చేసినట్లు తెలిపారు. మరో 5గురికి టెలిమెడిసిన్ పద్ధతిలో వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. ఈశిబిరంలో ఎక్కువగా కంటి వైద్య పరీక్షలు చేసినట్లు తెలిపారు. ఈశిబిరం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార పదార్థాల తయారీపై ప్రదర్శనను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ మారిశెట్టి శివశంకర్, నాయకులు గుబ్బల సూర్యచంద్రరావు, రేలంగి రాంబాబు, శ్రీనివాసు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ రాష్ట్ర పోటీల్లో ప్రతిభ

తణుకు టౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాస్కెట్‌బాల్ అండర్ -19 రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల విద్యార్థినులు తమ ప్రతిభను చాటి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. అన్నమయ్య జిల్లా మదనపల్లిలో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో కళాశాల విద్యార్థినులు ఎల్. పావని, ఎస్ఎం గాయత్రీ ఆడిన జట్టు రాష్ట్ర స్థాయిలో ద్వితీయస్థానం సాధించిందని ప్రిన్సిపాల్ భూపతిరాజు హిమబిందు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను, పీడీలు ఎం. శ్రీనివాసరావు, ఎం.రత్నకుమారిలను అభినందించారు.

నేడు యండగండిలో పీవీఎల్ పర్యటన

ఉండి: మండలంలోని యండగండిలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు శనివారం పర్యటించనున్నట్లు సర్పంచ్ గోగులమండ చినకృష్ణమూర్తి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే ఈ పర్యటనలో మొదటిగా నూతనంగా నిర్మించనున్న విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అనంతరం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమ నిధులు రూ.10 లక్షలు, జెడ్పీ నిధులు రూ.20 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.8 లక్షలు మొత్తం రూ.38 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను పీవీఎల్ ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన తెలిపారు.

మహిళకు గాయాలు

ఆకివీడు: మచిలీపట్నం నుంచి స్థానిక దుంపగడప రోడ్డులోని వినాయక గుడి ప్రాంతంలో నివసిస్తున్న సంచార జాతులకు చెందిన సీలం రంగమ్మను గురువారం రాత్రి ఆటో ఢీకొనడంతో తీవ్ర గాయాలైనట్లు ఎస్సైనాగబాబు శుక్రవారం చెప్పారు. నడిచి వెళ్లుతున్న ఆమెను వెనుక నుంచి అతి వేగంగా, నిర్లక్ష్యంగా ఏపీ 37 టీడీ 6224 నెంబర్ ఉన్న ఢీకొట్టిందని తెలిపారు. ఈ మేరకు ఆమె భర్త సీలం సాంబయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వంతులవారీ విధానంతో సమృద్ధిగా సాగునీరు



పెనుమదం శివారు అల్లంగుంటలో సాగునీరు అందుతున్న పంట చేలల్లో రైతులు, నాయకులు

పోడూరు: పెనుమదం శివారు అల్లంగుంటలో పంటచేలకు వంతులవారీ విధానంలో సాగునీరు సమృద్ధిగా అందుతుందని వైఎస్సార్ సీపీ మండల ఇంఛార్జి పితాని సత్యనారాయణ(చిన్న) అన్నారు. పెనుమదం శివారు అల్లంగుంటలో పంట చేలను శుక్రవారం ఆయనతో పాటు సొసైటీ చైర్మన్ కొత్రపాటి వీరాస్వామి, ఇరిగేషన్ ఏఈ ఎస్.శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా మండల ఇంఛార్జి చిన్నా, సొసైటీ చైర్మన్ వీరాస్వామిలు మాట్లాడుతూ పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ఇటీవల అల్లంగుంటలో పంట చేలకు నీరందడం లేదంటూ చేలో వాలీబాల్ ఆడి ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యే నిమ్మల వాస్తవాలు గ్రహించకుండా రాజకీయ ప్రయోజనాల కోసం డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. పలువురు రైతులు గుబ్బల లక్ష్మీనారాయణ, పెచ్చెట్టి రాంబాబు, చెల్లబోయిన రాంబాబు, గెద్దాడ బంగారయ్య, బండి పెద్దిరాజు, కోళ్ల సీతారామయ్య తదితరులు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి ఇటీవల తమ పంట చేలను పరిశీలించారన్నారు. ఆయన ఆదేశాల మేరకు వంతుల వారీ విధానంతో ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది తమ పంటచేలకు సమృద్ధిగా సాగునీరందిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు.

శ్రీరామక్షేత్రం పునఃప్రతిష్ఠ

ఉండి: ఎన్నో ఏళ్ల క్రితం జీర్ణావస్థకు చేరుకున్న ఉండి శ్రీరామక్షేత్రాన్ని ఆలయ నిర్మాణ కర్తల మూడోతరం వారసులు పూనుకుని అన్ని హంగులతో క్షేత్రాన్ని శుక్రవారం పునః ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు,పండితులు ఆయనకు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ పురాతన రామాలయాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్ది భక్తులకు అందుబాటులో ఉంచటం చాలా సంతోషకరమన్నారు. ఆలయ నిర్మాణకర్తల మూడో తరానికి చెందిన రిటైర్డ్ ఎంఈఓ ఆకిరి ఆనంద్ మాట్లాడుతూ ఈ ఆలయం కరోనా సమయంలో మూతపడటంతో ఇప్పుడు దానిని పూర్తిగా అన్ని హంగులు సమకూర్చి భక్తులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో నిర్వహకులు రజని, తిరునగరి రాధిక, తిరునగరి శ్రీపతి, వైఎస్సార్‌సీపీ నాయకులు గుండాబత్తుల సుబ్బారావు, కరిమెరక శివనాగరాజు, శేషాద్రి శ్రీను, రాయి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తణుకు చేరిన వేంకటేశ్వర వైభవ యాత్ర



తణుకులో వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాన్ని తీసుకువస్తున్న భక్తులు

తణుకు అర్బన్: యాదాద్రి వెంకన్న స్వామి తిరుమల నుంచి వేంకటేశ్వర వైభవయాత్ర పేరుతో నిర్వహిస్తున్న రథయాత్ర శుక్రవారం సాయంత్రం తణుకు చేరుకుంది. స్థానిక వాసవి క్లబ్ రాయల్స్, వాసవి వనిత క్లబ్ ప్రతినిధులు స్వామివారి రథానికి సాంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. తణుకు పట్టణంలోకి ప్రవేశించిన సమయం నుంచి రథంతోపాటు క్లబ్ మహిళలు కోలాట భజన చేస్తూ శ్రీవారి సంకీర్తన చేశారు. సెప్టెంబరు 25వ తేదీన తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి ప్రారంభించిన ఈ రథయాత్ర ఆంధ్రప్రదేశ్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయాలన్నింటికీ వెళ్తూ 100 రోజుల యాత్రలో భాగంగా తిరిగి తిరుపతి చేరుకుంటుందని, వెంకటేశ్వరస్వామి ఆలయాలన్నిటినీ అనుసంధానం చేస్తూ ఒకే తాటిపైకి తీసుకురావడమే తమ ధ్యేయమని రథయాత్ర నిర్వాహకులు వివరించారు. పారిశ్రామికవేత్త గమిని రాజా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ముత్యాల సత్యనారాయణ, అఖిలభారత బ్రాహ్మణ యువత ఉపాధ్యక్షుడు సూరంపూడి కామేష్, సృష్టి సుబ్బారావు, వాసవి క్లబ్ రాయల్స్ అధ్యక్షుడు జవ్వాది వీరభద్రయ్య, కోశాధికారి కట్టమూరి మురళి, క్లబ్ వ్యవస్థాపకులు జల్లూరి జగదీష్, వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు ఆకుల వీరకుమారి, కోశాధికారి జల్లూరి సుజాత, పీఆర్వో పాటోలు కృష్ణ, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

అపరిశుభ్ర వాతావరణంపై ప్రజలకు అవగాహన కల్పించాలి



తాడేపల్లిగూడెం మండలం అప్పారావుపేట గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: అపరిశుభ్ర వాతావరణం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం మండలంలోని మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి అప్పారావుపేట గ్రామంలో ఫ్రైడే డ్రైడే, వెక్టర్ కంట్రోల్, హైజీన్, దోమల ద్వారా వచ్చే వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ దోమల లార్వాలను గుర్తించడంలో ప్రజల్ని చైతన్యవంతులను చేయాలన్నారు. డ్రైడే పాటించడం ద్వారా దోమలను అరికట్టవచ్చన్నారు. అనారోగ్య సమస్యలుంటే గ్రామాల్లోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు.

లయన్స్ సేవలు అమోఘం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పేదలను ఆదుకోవడానికి లయన్స్‌క్లబ్ ఎప్పుడూ ముందువరసలో ఉంటుందని క్లబ్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, జోన్ చైర్‌పర్సన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజులు పేర్కొన్నారు. లయన్స్ జిల్లా గవర్నర్ కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన కార్యక్రమంలో తణుకు మండలం ఉండ్రాజవరంకు చెందిన నిరుపేద విద్యార్థికి వినికిడి యంత్రం రిపేర్లు నిమిత్తం జిల్లా లయన్స్‌క్లబ్ సభ్యుల సహాయ సహకారాలతో రూ 50 వేలు సాయం అందించారు.